# భాస్కర-మొల్ల రామాయణాలలో
# అవాల్మీకాలు - పరిశీలన



నిష్ఠల వేంకటనరసింహ అవధాన్లు భుక్త

# శ్రీరామచరితం

**డా. జి. అరుణకుమారి**
తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం

ప్రపంచాన్నే ప్రభావితం చేసిన వాల్మీకి రామాయణం క్రీస్తుపూర్వం ఒకటవ శతాబ్దం నాటిదని అంటారు. భగవంతుని లీలలను, మానవ ధర్మాన్ని, పతివ్రతా ధర్మాన్ని చాటిచెప్పే రామాయణ కావ్యాన్ని భారతీయ సాంస్కృతిక సమాజాన్ని రూపుదిద్దిన అసాధారణ శక్తిగా పరిగణిస్తారు. పండితులకే పరిమితమైన వేదోపనిషత్తుల సారాన్ని రామాయణ కావ్యం, మహాభారతేతిహాస రూపంలో సామాన్యమానవులకు అందించారు. రెండువేల సంవత్సరాల క్రితం నాటి వాల్మీకి రామాయణం దేశకాల పరిస్థితులకు అనుగుణంగా అనేక భాషలలో అనేక దృష్టికోణాలతో అనువాద రచనకు పాత్రమయ్యింది. 16వ శతాబ్దంలో తులసీదాసు రామాయణాన్ని సామాన్య మానవులకు అందుబాటులో ఉండాలని హిందీ భాషలో అనువదించినందుకు ఆనాటి మతఛాందసులు అతనిని సమాజం నుండి నెట్టివేసారు.

అష్టాదశ పురాణాలు, మహాభారతం, రామాయణం, భగవద్గీత మొదలైన గ్రంథాలన్నీ గుప్తుల కాలం నాటివని చారిత్రక విమర్శకుల అభిప్రాయం. పురాణాలకు పోటీగా బౌద్ధ జాతక కథలు ఆవిర్భవించాయని, బుద్ధుని జాతక కథలను మార్చి రామకథను రచించారని మన చరిత్ర పేర్కొన్నది. వైదిక మతస్థులు సురలని, బౌద్ధమతస్థులు అసురులని వీరి మధ్య జరిగిన సంఘర్షణే కావ్యవస్తువులయ్యాయనేది పండితుల అభిప్రాయం. సీతమ్మ వారి అగ్నిపరీక్ష విష్ణుకుండినుల కాలంనాటి దివ్యపరీక్షలను (అగ్నిపరీక్ష, జలపరీక్ష) పోలి ఉండటం దేశకాలపు స్థితిగతులు కాలానుగుణంగా కావ్యంలో చోటు చేసుకోవటం కనిపిస్తుంది.

కవుల ప్రతిభకు అలంకారికాలైన అవాల్మీక కల్పనలెన్నో తెలుగు కవుల కలం నుండి జాలు వారాయి. భారత రచనా విశేషాలను, మనోహర కల్పనలను చవిచూసిన పండితులు 12వ శతాబ్దంలో రామాయణాంధ్రీకరణకు పూనుకొని ఆంధ్రదేశంలో జనవ్యాప్తిలో ఉన్న కథలను విశేషాలను రామాయణాలలో చేర్చటం కనిపిస్తుంది. దేశ కాలాదుల ననుసరించి రామకథా కథనంలో భిన్నత్వం చోటుచేసుకుంది. వాల్మీకి రామాయణమేకాక సంస్కృతంలో ఆనంద, అద్భుత, ఆధ్యాత్మ, విచిత్ర, పట్టాభి రామాయణాలున్నాయి. జైన బౌద్ధ జాతక కథలలో దశరథ జాతకం, జైన గ్రంథాలలో విమలసూరి రచించిన పఉమచరియ/పద్మ చరితలో రాముడిని పద్ముడుగా వ్యవహరించారు. జానపద సాహిత్యంలోనూ అవాల్మీక రామాయణ కథనాలు వినిపిస్తాయి. సీతాన్వేషణకై వెళ్ళిన రామునికి దారిలో సీతమ్మవారి జాడ చెప్పినందుకు

చిలుక రామచిలుకగా, కోకిల గానకోకిలగా మెప్పునందుకున్నాయి. బదరీవృక్షం ఎడారిలోనూ జీవించేట్టుగా సీతమ్మ జాడ చెప్పినందుకు వరాన్ని పొందింది. అడవిలో మామిడిపండును గుర్తించటానికి హనుమంతుడు పండు చివరి భాగాన్ని కొరికాడని... పలురకాల కథనాలు జానపద సాహిత్యంలో చోటు చేసుకున్నాయి. ఇతర దేశాలలో రామాయణ గాథలు మరో కోణంలో ప్రదర్శితమవుతాయి. మాయలేడికై వెళ్ళిన రాముని ఆర్తనాదం విని కూడా సీతమ్మ వారిని విడిచి వెళ్ళని లక్ష్మణుని సీత దూషిస్తుంది. లక్ష్మణుడు లక్ష్మణరేఖ గీయటం భారతీయ సాహిత్యంలో వివరించబడింది. కాని బాలిద్వీపంలో లక్ష్మణుడు తన మర్మాంగాన్ని ఖండించి వేస్తాడు. బాలి, కాంబోడియా వంటి ద్వీపాలలో రామాయణ కథనం కొంత భిన్నంగా ఉంటుంది. వీటన్నిటికి కారణం మానవ కల్పనాశక్తి విస్తరించినంత మేరకు రచన కొనసాగటమే.

భాస్కర మొల్లరామాయణాలలో 'అవాల్మీకాలు–పరిశీలన' అనే గ్రంధాన్ని రచించిన శ్రీ నిష్ఠల నరసింహ అవధాన్లు భుక్త గారిని అభినందిస్తున్నాను. భుక్తగారు రామాయణ కావ్యాన్ని గురించి మూడు రోజుల పాటు ఉపన్యసించగల వాగ్ధాటి గలవారు. భక్తి, శ్రద్ధ, సత్యసంధత ఉండాలే గాని ఎవరినైనా శిష్యులుగా స్వీకరిస్తారు. మానవ ధర్మాన్ని చాటిచెప్పే రామాయణ రచన వీరి జీవిత పరమార్థం. 75 సంవత్సరాల వయసులో ఒక పరిశోధనకు తగిన అంశాన్ని స్వీకరించి ఆసక్తికరంగా పరిశీలించిన విధానం, అన్వేషణ, నిరూపణ ప్రశంసనీయం. భుక్త గారి భక్తితత్పరత ఈ రచన నిండా కనిపిస్తుంది. భాస్కర రామాయణంలో 28 అవాల్మీకాలను గణించి, ఇంకా పరిశీలించినట్లయితే అవాల్మీకాలు అనేకం కనిపిస్తాయని సూచించారు. భాస్కరుడు, మల్లికార్జున భట్టు, కుమార రుద్రదేవుడు, అయ్యలార్యుడు రాసిన పద్యాలను వర్ణించి ఔచిత్యం కొరవడిన సన్నివేశాలను సూటిగా ఖండించారు. ఉదాహరణకు రాముడు సీతమ్మతో భరతుని వద్దగాని లక్ష్మణుని వద్దగాని సుగ్రీవుని వద్దగాని విభీషణుని వద్దగాని దానవవీరులలో నీ మనసుకు నచ్చిన వారిన చేకొనము అని అంటాడు.

"ఘనతర సౌందర్యముగల – నిను చూచి దశాననుండు నిశ్చల మతియై
మనసిజ రాగము నొందక – మనమున ధైర్యంబు గలిగి మసలునె చెపుమా"

అని అయ్యలార్యుడు శ్రీరామచంద్రుని చేత చెప్పించాడు. సీతమ్మ వారి ఆభరణాలను గుర్తించిన హనుమంతుడు ఆరాధ్యదేవతైన సీతమ్మను ప్రబంధ నాయికలా వర్ణించిన తీరును ప్రవేశపెట్టిన మల్లికార్జున భట్టు రచనను విమర్శించారు. మొల్ల జననం గురించి సాహిత్యలోకంలో భిన్నాభిప్రాయాలున్నాయి. శ్రీ పూండ్ల రామకృష్ణయ్య మొల్ల రామాయణం వ్యాసంలోను, శ్రీ బాస్వలు దొర నెల్లూరు జిల్లా మాన్యాలులోను, బొద్దికూరపాడు వేంకటరంగ కవి పూర్వకవుల చరిత్రలోను, కావలి వేంకట రామస్వామి దక్షిణ హిందూ స్థానపు కవుల చరిత్రలోను,

ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ ముకుంద వికాసం పీఠికలోను మొల్లను గురించి భిన్న కథనాలను వివరించారు. భక్తగారు ఆతుకూరి మొల్ల నెల్లూరు సమీపంలోని గోపవరం నివాసి అని, ఆతుకూరి కేసన వరపుత్రిక అనే అంశాన్ని స్వీకరించారు. మొల్ల రామాయణ రచనలో చేసిన మార్పులను వివరించారు.

వాల్మీకి రామాయణంలో గౌతముడు అహల్యను వాయు భక్షణం చేస్తూ భస్మశాయినివై ఎవరికీ కానరాకుండమని శపించాడు. ఇది జారత్వ దోషానికి ప్రాయశ్చిత్తం. అహల్య శిలగా మారిందని పద్మపురాణం తెలియజేస్తుంది. దీనిని గురించి యాజ్ఞవల్క్య పరాశరులు చర్చించటం వలన ఇది ఆనాటి సామాజిక న్యాయశాస్త్రరీతులను వివరిస్తుంది. పోషణ సంస్కరణ లేని స్త్రీ బూడిద బుంగ కావటం సహజం కాని సుదతి రాయిగా మారటం అసహజం. తిరస్కరింపబడిన స్త్రీ హృదయం రాయిగా మారిందన్న అర్థంలో ప్రయోగింపబడిందనవచ్చు.

రామలక్ష్మణులు మిథిలా నగరానికి వెళుతుండగా మార్గమధ్యంలో రామపాద ధూళి సోకి ఒక రాయి సుదతిగా మారిన సందర్భం అందరికీ తెలిసిందే. కాని మొల్ల ఈ సందర్భంలో అహల్య పూర్వకథ వృత్తాంతాన్ని చెప్పకుండా మిథిలా నగరానికి వెళ్ళేదారిలో రాకుమారులకు విశ్వామిత్రుడు పూర్వకథను వివరిస్తాడు.

వాల్మీకి రామాయణంలో లేకపోయినా సంస్కృత రామాయణాలలోని భావాన్ని గ్రహించి మొల్ల రామకథను మలిచింది. మొల్లకు తులసీరామాయణం పరిచయముందని విమర్శకుల అభిప్రాయం. దీనికి ఉదాహరణ ఆధ్యాత్మరామాయణంలోనూ, తులసీ రామాయణంలోనూ, మొల్ల రామాయణంలోనూ భావసామ్యమున్న గుహుని ఆంతరంగిక వర్ణన.

సుడిగొని రాము పాదములు సోకిన ధూళి వహించి రాయి యే
ర్పడ నొక కాంతయయ్యెనట పన్నుగ నీతని పాదరేణు వి
య్యెడ వడి నోడసోక నిది యేమగునో యని సంశయాత్ముడై
కడిగె గుహుండు రామపదకంజ యుగంబు భయమ్ము పెంపునన్.

మొల్ల, అయోధ్యాకాండం ప. 32

మొల్ల రామాయణంలో సీతాస్వయంవరం, వివాహ సందర్భాలలో రసానుకూల శైలిని, అయోధ్యానగర వర్ణన సందర్భంలో శ్లేషాలంకారాన్ని చమత్కారంగా ప్రయోగించింది. జీవితం క్షణభంగురమని మోక్ష సాధన ఒక్కటే మార్గమని భావించి భావార్థ రామాయణ రచన చేసిన వారున్నారు. ఆత్మరాముని ప్రతిష్ఠించటమే ఆత్మజ్ఞానాన్ని పొందటమని భావించి ఆధ్యాత్మ రామాయణ రచనకు పూనుకున్నవారున్నారు. సోదరభావాన్ని ఆత్మీయతను పెంపొందించే భక్తి రస రామాయణాన్ని చేపట్టిన వారున్నారు. వీరరసాన్ని ప్రేరేపించి ఉపాసన రామాయణ రచన చేసిన వారున్నారు. ఎన్ని కల్పనలు చోటుచేసుకున్నా రామాయణం రమణీయమే కదా. ఇంతటి రమణీయ రామాయణాలలోని అవాల్మీకాలను ఎంచి అందించిన భక్తగారు మరెన్నో రచనలు పూర్తిచేయగలరని ఆశిస్తున్నాను.